
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 10 అక్టోబరు 2025



సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి: డీఆర్వో

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని డీఆర్వో శ్రీనివాసమూర్తి సూచిం చారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అధికారులతో నిర్వహిం చిన సమావేశంలో ఐవీఆర్ఎస్ కాల్స్ డేటాపై సమీక్షించారు. మ్యుటే షన్లకు సంబంధించి ఎక్కువగా అర్జీలు పెండింగ్‌లో ఉంటున్నాయని, పరిష్కారానికి అవకాశం ఉండే సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం చేయలేనివాటికి సంబంధించి అర్జీదారులకు ప్రభుత్వ నిబంధనలను వివరించాలన్నారు.


పైడితల్లి ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి తదితరులు

ఆలయాన్ని వేగంగా విస్తరిస్తాం

- పైడితల్లి దేవస్థానం చైర్మన్, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు
- నిర్మాణ పనులకు శంకుస్థాపన

విజయనగరం/ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయ విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశామని దేవస్థానం కమిటీ చైర్మన్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు తెలిపారు. నగరంలోని పైడిమాంబ చదురుగుడి వద్ద విస్తరణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ కామన్ గుడ్ ఫండ్, ప్రభుత్వం విడుదల చేసిన నిధులు కలిపి రూ.కోటీ 80 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఆలయం విస్తరణ వల్ల భక్తులు మరింత సునాయసంగా, వేగంగా పైడిమాంబను దర్శించుకోవచ్చునన్నారు. గత కొన్నేళ్లుగా విస్తరణ పనులు చేపట్టాలని అనుకున్నా, వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చిందన్నారు. టెండర్ల ప్రక్రియ, డీపీఆర్ సిద్ధమైన నేపథ్యంలో పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తి అవుతాయని చెప్పారు. పైడిమాంబ ఆలయ విస్తరణ పనులకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టరు రామసుందర్‌రెడ్డి, ఆలయ ఈవో కె.శిరీషతో పాటు పైడిమాంబ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు కామేష్ తదితరులు పాల్గొన్నారు. శంకుస్థాపనకు ముందు పైడిమాంబను గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

మైనర్లు అని మర్చిపోవద్దు



- తల్లిదండ్రులూ జాగ్రత్త!
- పిల్లలకు వాహనాలు ఇస్తే మూల్యమే..
- హెచ్చరిస్తున్న పోలీస్ అధికారులు
- స్వయంగా గుర్తించిన హోంమంత్రి అనిత

మైనర్ బాలురు బైక్ డ్రైవింగ్ చేయడం ఇటీవల కాలంలో జిల్లాలో పెరిగింది. పల్లె నుంచి పట్టణం వరకు ఇదే జరుగుతోంది. తల్లిదండ్రులు ముందుజాగ్రత్త లేకుండా వారికి వాహనాలు ఇస్తున్నారు. వీధిలోనే కదా అని అనుకుంటున్నారు. కానీ అలవాటు పడిన పిల్లలు ప్రధాన రహదారులపైకి కూడా వస్తున్నారు. సాక్షాత్తు హోంమంత్రి వంగలపూడి అనిత ఎదుటే ఇద్దరు బాలురు స్కూటీపై హల్‌చల్ చేయడం, ఆమె మందలించిన విషయం తెలిసిందే.

రాజాం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో అక్కడా ఇక్కడా అన్న తేడా లేకుండా మైనర్లు ద్విచక్ర వాహనాలపై కనిపిస్తున్నారు. ఇదే సమయంలో పోలీసుల తనిఖీలు తక్కువయ్యాయన్న విమర్శలున్నాయి. వారు చూసీచూడ నట్టుగా వ్యవహరించడం వల్లే మైనర్లు వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. చిన్న వయసులో బైక్ అలవాటు పడుతూ కాస్త పెద్దయ్యాక ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. జూన్‌లో బొండపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఆ ముగ్గురు రెండు పదుల వయసులో వారే. మే నెలలో డెంకాడ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలోనూ ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఆ ఇద్దరూ చిన్నవయసు వారే. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతుండడం ఆందోళన కలిగిస్తోంది. పిల్లాడు మారం చేశాడనో.. అలుగుతున్నాడనో బైక్‌లు కొనిచ్చి చేతిలో పెడితే ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల పల్లెల్లో సైతం ఇదే సంస్కృతి విస్తరిస్తోంది. ఇంటా ద్విచక్ర వాహన వినియోగం పెరుగుతోంది. మైనర్లు సైతం బైక్ డ్రైవింగ్ చేస్తున్నారు. వారిని కుటుంబసభ్యులు నిలువరించే ప్రయత్నం చేయడం లేదు. అలవాటు అయ్యాక పెద్దలు చెప్పినా పిల్లలు వినడం లేదు.

ఆ కారణాలతోనే ప్రమాదాలు..

జిల్లాలో ఇటీవల ఏదోచోట ప్రమాదం జరుగుతూ ఉంది. హెల్మెట్ ధరించకపోవడం, పరిమితికి మించి ప్రయాణాలు చేయడం, అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ల వాహనాలు నడపడం వంటి కారణాలతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే తాము మాత్రం కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. గత ఏడాది ఏకంగా 60వేల వరకూ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అయినా ప్రమాదాలకు అడ్డుకట్ట పడడం లేదు. విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. చాలామంది తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టిసారించడం లేదు. చేతులు కాలాక (మిగతా 8వ పేజీలో..)


బాలురతో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత(ఫైల్)



శృంగవరపుకోట మండల పరిధిలో జెఎస్‌డబ్ల్యూ (జిందాల్) అల్యూమినియం కంపెనీకి అప్పగించిన భూములు

పోరు.. జోరు

- సాగుతున్న జిందాల్ భూ నిర్వాసితుల పోరాటం
- పట్టించుకోని పరిశ్రమ యాజమాన్యం
- జిల్లా అధికారులకు తలనొప్పిగా మారిన సమస్య
- కోర్టులు, కమిషన్ల చుట్టూ తిరుగుతున్న రెవెన్యూ
- శాంతిభద్రతల్లో విమర్శలెదుర్కొంటున్న పోలీస్‌లు
- ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటులో తీవ్ర జాప్యం

శృంగవరపుకోట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యం పరిశ్రమను నిర్మించకపోవడంతో భూములు ఇచ్చిన రైతులు తిరిగి తమ భూములను తమకు అప్పగించాలన్న డిమాండ్‌తో కొన్నాళ్లుగా పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. 110 రోజులుగా జరుగుతున్న ఉద్యమంతో ఇటు రెవెన్యూ, అటు పోలీస్ శాఖకు తలనొప్పిగా మారింది. ఎప్పుడో 18 సంవత్సరాల క్రితం అప్పగించిన భూముల (మిగతా 8వ పేజీలో..)



- పరిశ్రమ నిర్మాణానికి భూములు తీసుకున్న జెఎస్‌డబ్ల్యూ అల్యూమినియం (జిందాల్) యాజమాన్యం చేసిన అన్యాయాన్ని జిందాల్ భూ నిర్వాసితులు ఆ మధ్య ఎస్టీ కమిషన్ ముందు ఏకరువు పెట్టారు. దీంతో కమిషన్ వద్దకు విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి, శృంగవరపుకోట తహసీల్దార్ డి.శ్రీనివాసరావు హాజరవ్వాల్సి వచ్చింది. అంతుకు ఒకట్రెండురోజుల ముందు కూడా జిందాల్ భూనిర్వాసితుల కేసుకు సంబంధించి హైకోర్టుకు తగిన రికార్డులు సమర్పించేందుకు రెవెన్యూ అధికారులు అక్కడే మకాం వేయాల్సి వచ్చింది. కోర్టులు, కమిషన్‌ల చుట్టు తిరుగుతుండడంతో రోజు రోజుకు పనిభారం పెరుగుతోంది.



- జిందాల్‌కు కేటాయించిన భూముల్లో ప్రతిపాదిత పరిశ్రమను నిర్మించకపోవడంతో అప్పట్లో చేసిన తీర్మానాల రద్దుకు గ్రామ సభను ఏర్పాటు చేయాలని భూనిర్వాసిత రైతులు సర్పంచ్ యాళ్ల రమణను ఇటీవల కోరారు. ఈమేరకు సెప్టెంబర్ 28న గ్రామ సభను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అంతవరకు గ్రామ సభ నిర్వహణకు సముఖంగా ఉన్న కార్యదర్శి కలెక్టర్ వద్దకు వెళ్లాలని చెప్పి రావడం మానేశారు. గ్రామ సభ నిర్వహణకు పూనుకున్న సర్పంచ్‌ను పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు భగ్గుమన్నారు. అలాగే జిందాల్ భూనిర్వాసితుల పోరాటానికి మద్దతు ఇస్తున్న పలువురిని స్టేషన్‌కు పిలుస్తున్నారు. ఇదంతా విమర్శలకు తావిస్తోంది.



- రెవెన్యూ, పోలీస్ శాఖలు నలుగుతుండడమే తప్ప జిందాల్ పరిశ్రమ యాజమాన్యం నుంచి కనీస స్పందన లేదు. ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మాణానికి అనుమతులు ఇచ్చినందున ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించుకోవాలన్న విధంగా తప్పించుకుతిరుగుతోంది.



కుమారుడే ఆయన పాలిట కాలయముడయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వడానికి నిరాకరించిన తండ్రిపై కుమారుడు కోపంతో దాడి చేశాడు. చాపలు కుట్టే గూటంతో తండ్రి తలపై బలంగా మోదాడు. తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బాడంగి మండల కేంద్రంలోని సినిమాహాల్ కాలనీలో ఉంటున్న భువనగిరి రాజేశ్వరరావు (68) విషాదాంతమిది.

4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలి

- ఈనెల 30లోగా బ్యాంకు గ్యారెంటీలు పూర్తి కావాలి
- కలెక్టర్ రామసుందర్ రెడ్డి



విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో 4.5 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. పంట కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మండల స్థాయి, గ్రామ స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ ప్రత్యేక పంటలు, దిగుబడి వచ్చే సమయం, సేకరణపై మండల స్థాయి ప్రణాళికను రూపొందించాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని, మద్దతు ధర... ట్రక్ షీట్ విధానం తదితర అంశాలపై ప్రచారం చేయాలన్నారు. ఆర్ఎస్‌కెతో మ్యాపింగ్, రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని తెలిపారు. పౌర సరఫరాల అధికారి మిల్లులను ట్యాగ్ చేయడం, బ్యాంకు గ్యారెంటీలను తీసుకోవడం, అన్నిమిల్లులు పని చేస్తున్నది లేనిదీ తనిఖీ చేయడం, సీఎస్‌డిటిలకు శిక్షణ వంటి కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన మెటీరియల్‌ను (మిగతా 8వ పేజీలో..)



గోధార్

- పశువులకూ గుర్తింపు సంఖ్య
- ఆధార్ తరహాలో కేటాయింపు
- తిరుపతి జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు
- దశలవారీగా మిగిలిన జిల్లాల్లో..
- సిద్ధంగా ఉన్నామంటున్న జేడీ

మెంటాడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మనుషులకు ఆధార్ ఉన్నట్టే పశువులకూ ఓ గుర్తింపు సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వం సృష్టించనుంది. ఈ ప్రక్రియకు గోధార్‌గా నామకరణం చేసింది. ఇందుకోసం తిరుపతి జిల్లాను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసేందుకు సన్నద్ధమవుతోంది. గోధార్ నమోదులో భాగంగా ముందుగా రైతు పేరు, ఊరు, వయసు, ఆయనకున్న పశువుల సంఖ్య వంటి వివరాలు నమోదు చేస్తారు. అనంతరం పశువుల మూతిపై ఉండే ముట్టెకున్న ప్రత్యేకత ఆధారంగా గోధార్ కేటాయిస్తారు. పశువుల ముట్టెలోని స్వేద గ్రంధులకు శాస్త్రీయంగా ప్రత్యేకత ఉంటుందని పశువైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే ముట్టెకు ముట్టెకు మధ్య వ్యత్యాసం ఉంటుందని గుర్తించారు. అందుకే గోధార్‌కు ముట్టెను ప్రామాణికంగా తీసుకోనున్నారు.

పశువు జాతి, రంగు, ఈతల సంఖ్య, పాల దిగుబడి, పునరుత్పాదక స్థితి వంటి వివరాలు నమోదు చేసి ఆధార్ తరహాలో 12 అంకెల సంఖ్యను కేటాయిస్తారు. ఇదిలా ఉంటే గోధార్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓ యాప్‌ను అభివృద్ధి చేస్తోంది. ఆ యాప్ లోకి వెళ్లి ముట్టెను స్కాన్ చేయగానే రైతుతోపాటు పశువుల వివరాలు ప్రత్యక్షమవుతాయి. ప్రయోగాత్మకంగా అమలవుతున్న తిరుపతి జిల్లాలో ఇప్పటికే రెండులక్షల పశువుల గుర్తింపు సంఖ్యను పూర్తిచేసినట్టు సమాచారం. ఆ జిల్లాలో పూర్తయ్యాక దశలవారీగా మిగిలిన జిల్లాలో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో మొత్తం పాడిపశువులు 4,75,805 ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో ఆవులు 3,77,960, గేదెలు 97,845 ఉన్నాయని అధికారిక లెక్కలు సూచిస్తున్నాయి. ఇవికాకుండా (మిగతా 8వ పేజీలో..)

గాడిన పడేదెప్పుడో ?

- పౌరసరఫరాల శాఖలో ఇప్పటికీ అదే వైఫల్యం
- రేషన్ బియ్యం పక్కదారి
- కొందరు మిల్లర్ల చేతివాటం
- వైసీపీ హయాంలో అధికారిపై చర్యలకు మీనమేషాలు




విజయనగరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పౌరసరఫరాల శాఖ పనితీరు మెరుగుపడడం లేదు. గత ప్రభుత్వంలో ఉన్న పరిస్థితులే కొనసాగుతున్నాయి. రేషన్ సరఫరా పక్కదారి పడుతోంది. లెవీలోనూ రీసైక్లింగ్ జరుగుతోంది. డీలర్లకు అందించే రేషన్ బియ్యంలో తరుగు వస్తోంది. ఆ ప్రభావం కార్డుదారుడికి ఇచ్చే బియ్యంపై పడుతోంది. అటు మిల్లర్లు సన్నబియ్యంలో రేషన్ బియ్యం కలిపి నిలువునా మోసగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ నిద్దరోడుతోంది.

జిల్లాలో రేషన్ బియ్యం దందాను నియంత్రిస్తున్నట్టు యంత్రాంగం చెబుతోంది కానీ కేసులు, పట్టుబడిన సరుకును చూస్తే అది ఒట్టిమాటగా తేలిపోతోంది. విజిలెన్స్ గణాంకాలను పరిశీలిస్తే నమ్మలేని నిజాలు బయటపడుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 20 వరకూ కేసులు నమోదుచేసి 40 మంది వరకూ అరెస్టు చేశారు. రూ.46.38 లక్షల విలువైన 1,019.44 క్వింటాళ్ల బియ్యం (మిగతా 8వ పేజీలో..)

మనసు ఆరోగ్యమూ ముఖ్యమే

- శరీరంపై ఉన్న శ్రద్ధ మనసుపై ఏదీ?
- జిల్లాలో అధికమవుతున్న కేసులు
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం



విజయనగరం రింగురోడ్డు/ రాజాం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చాలామంది చిన్నచిన్న కారణాలతో మానసిక ఒత్తిడిని తట్టుకోలేక అఘాయిత్యాలకు, అత్మహత్యలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మారుతున్న జీవన శైలితో మనిషి మానసిక దృఢత్వాన్ని కోల్పోతున్నారు. దీనికితోడు మనిషి జీవితం యాంత్రీకరణగా మారిపోయింది. క్షణం తీరక లేకుండా గడుపుతున్న తరుణంలో ఒత్తిడి తట్టకోలేక చాలా మంది మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు. వాటి నుంచి బయటపడలేక జీవితానికి నష్టం కలిగించుకుంటున్నారు. మంచి వ్యాయామం, పౌష్టికాహారంతో వ్యాధులను దూరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కథనం..

ఏదో ఒక సమస్యతో..

చాలామంది ఏదో ఒక రకమైన మానసిక సమస్యతో బాధపడుతున్నారని అంచనా. ఇప్పటి తరం ఎక్కువగా 'సైలెంట్ సఫర్స్' అంటే బయట నవ్వుతున్నా, లోపల మానసికంగా కుంగిపోతున్నారని.. ఒక్కోసారి మనసు అదుపుతప్పి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని సైకియాట్రిస్ట్‌లు చెబుతున్నారు. ప్రధానంగా డిప్రెషన్, యాంగ్జైటీ, ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు పెద్దవారిలోనే కాకుండా యువత, విద్యార్థులు, గృహిణుల్లో కూడా విస్తరిస్తున్నాయని చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం సామాజిక మాధ్యమాల ప్రభావమేనని.. పోలికలు, అవమాన భారాలు, ఆర్థిక ఒత్తిడి ఇవన్నీ కలిపి మనస్సుని దెబ్బతీస్తున్నాయని అంటున్నారు. దీంతో జిల్లాలో మానసిక సమస్యలతో బాధపడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని వైద్యులు తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మానసిక చికిత్స విభాగం ఉంది. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా మానసిక చికిత్స కేంద్రాలు ఉన్నాయి. ఎక్కువగా విద్యార్థులు, యువకులు ఈ కేంద్రాలకు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

కారణాలు ఇవే..

జీవనశైలి: అసమతుల్య ఆహారం, జంక్‌ఫుడ్ అధికంగా తీసుకోవడంతో పాటు నిద్రలేమి వల్ల మెదడులోని రసాయనాల్లోని ప్రభావం చూపుతుంది. దీనివల్ల ఆందోళన, చిరాకు, నిరాశ కలుగుతాయి. అలాగే మద్యపానం, ధూమపానం, ఇతర మత్తుపదార్థా వినియోగం వల్ల తాత్కాలిక ఉపశమనం కలిగినా, దీర్ఘకాలంలో మనస్సుపై ప్రభావం చూపుతాయి.

కుటుంబ సమస్యలు: కుటుంబ కలహాలు, విడాకులు, ప్రేమ వైఫల్యాలు, తల్లిదండ్రులు అంచనాల ఒత్తిడి, ఒంటరితనం లేదా సహచర్యం లేకపోవడం, దౌర్జన్యం, హింసకు గురవ్వడం.. ఇవన్నీ మనస్సులో అస్థిరత, భయం, నిరాశ వంటి భావోద్వేగాలు పెంచుతాయి. సామాజిక ఒత్తిడులు, పని ఒత్తిడి, అధిక పనిభారం, ఉద్యోగంలో అధికారుల ఒత్తిడి, లక్ష్యాలను చేరుకోవాలని ఒత్తిడి చేయడం, విద్యార్థుల్లో మార్కులు, పరీక్షలు, పోటీ కారణంగా ఆందోళన, అప్పులు, ఉద్యోగ నష్టం, ఆదాయం తగ్గడం వల్ల కలిగే మానసిక భారాలు, ఆర్థిక సమస్యలు వల్ల మనస్సు అదుపుతప్పి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

- కుటుంబంలో ఎవరికైనా మానసిక సమస్యలు ఉండడం, హార్మోనుల అసమతుల్యత వల్ల కూడా మానసిక సమస్యలు రావచ్చును.

జాగ్రత్తలు తప్పనిసరి..

మానసిక ఒత్తిడికి గురైనప్పుడు సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి. ముఖ్యంగా మానసిక ఉల్లాసం కలిగించే కార్యక్రమాలు అలవర్చుకోవాలి.

- బంధువులు, స్నేహితులతో గడపడం యోగా, ధ్యానం వంటివి చేయాలి అలాగే మత్తుపదార్థాల వినియోగాన్ని ఆపివేయాలి.
- ఉద్యోగం వల్లనో, కుటుంబ కలహాలు వల్లనో మానసిక సమస్యలు కలిగితే అశ్రద్ధ చేయకుండా వారి సన్నిహితులతో చెప్పుకోవాలి.
- అలాగే మానసిక వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. కుటుంబ సభ్యులు కూడా మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి తాము ఉన్నామన్న భరోసా కల్పించాలి. అప్పుడే వారు మానసిక సమస్య నుంచి బయటపడతారు.

- నగరానికి చెందిన ఓ వ్యక్తి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. నెలసరి వేతనం లక్షకు పైమాటే. ఇటీవల విజయనగరానికి వచ్చి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకు వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అతను ఉద్యోగంలో తీవ్ర ఒత్తిడికి లోనవ్వడంతోటే ఈ ఘటనకు పాల్పడినట్టు తెలిసింది.
- బొబ్బిలి ప్రాంతానికి చెందిన ఓ ఉద్యోగి కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆయనకు సైక్రియాట్రిస్ట్ సలహాతో చికిత్స అందించడంతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్నాడు.
- మెంటాడ మండలంలోని ఓ మహిళ భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకోవడానికి సమీపంలో చెరువు వద్దకు వెళ్లింది. అనుమానంతో ఆమెను అనుసరించిన ఒక వ్యక్తి ఆత్మహత్య ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులు ఆమెకు, భర్తకు వైద్యుల పర్యవేక్షణలో కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో భర్త ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఆమె ప్రస్తుతం కిరణా వ్యాపారం ప్రారంభించింది. కుటుంబం హాయిగా జీవిస్తోంది.

యోగా మంచి చిట్కా..

మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యానికి యోగా మంచి చిట్కా. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో 45 నిమిషాల పాటు యోగా చేస్తే మంచి ఫలితం చూపుతుంది. సూర్యనమస్కారాలు, సూక్ష్మ వ్యాయామాలతో మానసిక ఒత్తిడి నుంచి దూరం కావొచ్చు. శ్వాసపై ధ్యాస పెట్టి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

-టీటీవీ రమణమూర్తి, యోగా శిక్షకుడు, రాజాం

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి..



ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహాల కారణంగా చాలామంది చికిత్స తీసుకోవడానికి భయపడుతున్నారు. మానసిక సమస్యలను బలహీనతగా లేదా పిచ్చిగా భావించడంతో ప్రజలు బహిరంగంగా మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. పేద వారి నుంచి ధనవంతులు, బాగా చదువుకున్న వారికి కూడా మానసిక సమస్యలు ఎప్పుడో ఒకసారి రావడం సర్వసాధారణం. మానసిక సమస్యలు ఉన్న వ్యక్తి సరైన చికిత్స తీసుకోవడం లేదు. మానసిక సమస్యల వల్లే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

-డాక్టర్ జాగారపు రమేష్, సైకియాట్రిస్ట్, విజయనగరం

ఒత్తిడికి లోనై.. ప్రాణాలు తీసుకుని..

- గత నెల 26న గుర్ల మండలం దమరసింగి గ్రామానికి చెందిన పిన్నింటి సత్యనారాయణ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివాహం చేసుకోవాలని కుటుంబసభ్యులు కోరగా నిరాకరించాడు. ఒత్తిడి చేయడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- ఈ ఏడాది ఆగస్టులో కొత్తవలసకు చెందిన నవదంపతులు కొప్పల చిరంజీవి, గీతల వెంకటలక్ష్మి మృతిచెందారు. చిరంజీవి ఫ్యాన్‌కు ఉరివేసుకోగా.. వెంకటలక్ష్మి నేలపై విగతజీవిగా పడి ఉంది. పెళ్లయిన ఎనిమిది నెలలకే మృతిచెందడం సంచలనంగా మారింది.
- ఈ ఏడాది మార్చిలో వంగర మండలం కింజంగి గ్రామానికి చెందిన శ్రావణి అనే మహిళ ఇద్దరు పిల్లలతో కలిసి మడ్డువలస కాలువలో దూకేసింది. భర్తకు దూరంగా పిల్లలతో ఉంటున్న ఆమె మానసికంగా కుంగిపోయింది. బతకలేక పిల్లలిద్దర్నీ తోసి తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తల్లితో పాటు కుమారుడ్ని కాపాడారు. కుమార్తె మాత్రం చనిపోయింది.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

జగన్ పర్యటన వల్ల ఒరిగేదేమీ లేదు

- పరిమితులతో కూడిన అనుమతులిస్తే వంద వాహనాల్లోనా?
- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ ఉత్తరాంధ్ర పర్యటన వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని, ఆయన ఉనికి కాపాడుకోవడం కోసమే పర్యటనలు చేస్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ పర్యటనకు పరిమితులతో కూడిన అనుమతులిస్తే, వంద వాహనాల్లో రావడం దేనికి సంకేతమని? ప్రశ్నించారు. ఇది శాంతిభద్రతల సమస్యలు సృష్టించడానికి కాదా? అని నిలదీశారు. మూడు నెలలకు ఒకసారి ఆయన రాష్ట్రంలో పర్యటించి ఆ తరువాత ప్యాలెస్‌కే పరిమితం అవుతున్నారన్నారు. దీనివల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. జగన్‌ను ఎమ్మెల్యేగా గెలిపించారని, ఆయనతో పాటు 10 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, వీరంతా అసెంబ్లీ వేదికగా గళం విప్పాలని సూచించారు. ఇప్పుడు అసెంబ్లీలో టీడీపీ, బీజేపీ, జనసేన ఎమ్మెల్యేలే తమ నియోజక వర్గాల్లోని సమస్యలపై స్పందిస్తున్నారన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం అసెంబ్లీకి వెళ్లడం లేదన్నారు. జగన్ హయాంలో మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తి చేయకపోగా, ఇప్పుడు పరిశీలన యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సమావేశంలో టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎటూతేలని శవ పంచాయితీ

- మళ్లీ దహన సంస్కారాలను అడ్డుకున్న తమ్మన్నమెరక గ్రామస్థులు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



రోడ్డుపైకి వచ్చి అడ్డుకుంటున్న తమ్మన్నమెరక గ్రామస్థులు

కొత్తవలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అప్పన్నదొరపాలెం పంచాయతీ పరిధిలోగల జోడుమెరక గ్రామంలో ఎవరైనా మృతిచెందితే జోడు మెరక, తమ్మన్న మెరక గ్రామాల మధ్య వివాదం మొదలవుతోంది. ఈ శవ పంచాయితీ ఎటూ తేలని పరిస్థితి నెలకొంది. తాజాగా బుధవారం దహన సంస్కారాలను పోలీసులు అడ్డుకున్నారు. మళ్లీ పోలీసులు రంగం ప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. గ్రామస్థుల కథనం మేరకు బుధవారం జోడుమెరకలో ఓ వ్యక్తి మృతిచెందాడు. దహన సంస్కారాల కోసం తమ్మన్న మెరక శశ్మానానికి తీసుకెళ్లారు. ఎప్పటిలాగనే తమ్మన్న మెరక గ్రామస్థులు తమ శశ్మాన వాటికకు తీసుకురావద్దని అడ్డుకున్నారు. దీంతో మళ్లీ పోలీసులు రంగప్రవేశం చేసి దహన సంస్కారాలు చేయించారు. ఎప్పటికప్పుడు తాము వచ్చి దహనసంస్కారాలు చేయించలేమని, ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిం చుకోవాలని రెండు గ్రామాల ప్రజలకు పోలీసులు సూచించారు.

అప్పన్నదొరపాలెం పంచాయతీ పరిధిలోని జోడుమెరక, తమ్మన్న మెరక గ్రామాలకు వేర్వేరుగా శశ్మాన వాటికలు ఉండేవి. జోడుమెరక గ్రామానికి చెందిన శశ్మానవాటికను కొందరు గ్రామస్థులు రియల్‌ఎస్టేట్ వ్యాపారికి విక్రయించడంతో ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. దీంతో జోడుమెరక గ్రామస్థులు తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే తమ్మన్నమెరక శశ్మాన వాటికకు తీసుకెళ్లి దహన సంస్కారాలు చేసుకునేవారు. కొద్దిరోజులుగా తమ శశ్మాన వాటికకు దహన సంస్కారాల కోసం తీసుకు రావద్దని జోడుమెరక గ్రామస్థులకు తమ్మన మెరక గ్రామస్థులు తేల్చిచెప్పారు. ఇటీవల ఓ వ్యక్తి జోడుమెరకలో చనిపోవడంతో తమ్మన్న మెరక శశ్మానవాటికకు తీసుకెళ్లగా అడ్డుకోవడంతో చాలాసేపు రోడ్డుపైనే మృతదేహాన్ని ఉంచాల్సివచ్చింది. దీంతో మండలానికి చెందిన అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని దహన సంస్కారాలు చేయించారు. తాజాగా బుధవారం జోడుమెరకకు చెందిన మరోవ్యక్తి చనిపోవడంతో మళ్లీ తమ్మన్నమెరక గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. మరోసారి పోలీసులు వచ్చి సర్ది చెప్పి దహన సంస్కారాలు చేయించారు.

నిలిచిన గ్రామీణ బ్యాంకు సేవలు

- నాలుగు బ్యాంకుల విలీనమే కారణం
- ఈ నెల 13న పునరుద్ధరణ



రాజాం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. ఈ నెల 13 తేదీ ఉదయం 10 గంటల వరకు ఈ సేవలు ఉండవు. కేంద్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నాలుగో విడత బ్యాంకుల విలీనంపై గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. మన రాష్ట్రంలో నాలుగు బ్యాంకులు ఒకే బ్యాంకు కింద విలీనం చేసింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి. ఇవన్నీ ఒకే సంస్థ కింద అంటే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారనున్నాయి. సాంకేతిక సమస్యలను ఒక కొలిక్కి తెచ్చేందుకుగాను ఐదు రోజుల పాటు రాష్ట్రంలోని ఈ నాలుగు బ్యాంకులు సేవలను నిలిపివేశారు. జిల్లాలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు 76 శాఖలతో నడుస్తోంది.

ఖాతాదారులకు అసౌకర్యం..

గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్, ఏటీఎం సేవలు, బ్యాంకుమిత్ర సేవలు సైతం నిలిచిపోయాయి. ఈ నెల 11 రెండో శనివారం కలిసి వచ్చింది. 12న ఆదివారం సెలవు దినం. అందుకే 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు గ్రామీణ వికాస్ బ్యాంకు అన్నపేరు వినిపించదు. ఇక నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగానే కనిపించనుంది. అయితే చాలామంది సేవలు నిలిపివేశారని తెలియక ఇబ్బందిపడ్డారు. ఏటీఎం కార్డులు పనిచేయక పోవడంతో అయోమయానికి గురయ్యారు. చివరకు అసలు విషయం తెలుసుకుని ఊపిరిపీల్చుకున్నారు.

సహకరించాలి..

గ్రామీణ వికాస్ బ్యాంకుతో పాటు మరో మూడు గ్రామీణ బ్యాంకులు విలీనం కానున్నాయి. ఇక నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మాత్రమే ఉంటుంది. విలీన ప్రక్రియలో భాగంగానే ఐదు రోజుల పాటు బ్యాంకు సేవలు నిలిపివేశారు. ఆన్‌లైన్ సేవలు సైతం నిలిచిపోతాయి. ఖాతాదారులు ఈ విషయాన్ని గ్రహించాలి. బ్యాంకుకు సహకరించాలి.

-హేమసుందర్, బ్రాంచ్ మేనేజర్, రాజాం

నీలావతిలో ఉద్రిక్తత

- ఆక్రమణల తొలగింపునకు పోలీసుల మోహరింపు
- అడ్డుకున్న రైతులు
- కోర్టు నుంచి స్టే రావడంతో వెనుతిరిగిన అధికారులు



ఎక్స్‌కవేటర్‌కు అడ్డంగా నిలబడిన రైతులు

గంట్యాడ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలావతి గ్రామంలోని గురువారం ఉదయం నుంచి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు యంత్రాలతో రావడంతో మహిళలు అడ్డుకున్నారు. మధ్యాహ్నం కోర్టు నుంచి స్టేరావడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు వెనుతిరిగారు.

నీలావతిలోని 160-23, 198-2 సర్వేనెంబరల్లో ఉన్న రస్తా పోరంబోకు ప్రభుత్వ భూమిలో 19 మంది రైతులు పశువులు శాలలు, కళ్లాలు వేసుకుని కొద్దేళ్లుగా ఉంటున్నారు. ఈ ఆక్రమణలను తొలగించాలని గ్రామానికి చెందిన ఒకరు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు విచారణ చేసిన ఆక్రమణదారులకు రెండునెలల కిందట ఫారం-7 నోటీసు ఇచ్చారు. అలాగే ఇటీవల ఫారం-6 నోటీసు కూడా రైతులు అందించారు. ఈనెల మూడో తేదీన తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, పోలీసులు గ్రామానికి వెళ్లి సమావేశం నిర్వహించారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ప్రభుత్వ స్థలాలను ఖాళీ చేయాలని రైతులకు సూచించారు. లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. రైతులు పశువులు శాలలు తీయక పోవడంతో గురువారం ఉదయం ఏడుగంటల సమయంలో తహసీల్దార్ నీలకంఠరెడ్డితోపాటు ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, రెవెన్యూ సిబ్బంది కలిసి నీలావతి గ్రామానికి యంత్రాలతో చేరుకున్నారు. పశువుల శాలలను తొలగించేందుకు ప్రయత్నం చేయడంతో రైతులు అడ్డుకున్నారు. స్థలాలను ఖాళీ చేయడానికి సమయం కావాలని రైతులు కోరారు. ఇప్పటికే నోటీసుఇచ్చి చాలా రోజులు అయ్యిందని, ఇది సరైనది కాదని తహసీల్దారు వివరించారు. చివరికి రెవెన్యూ సిబ్బంది పశువుల శాలలకు సంబందించిన తాటికమ్మలు తొలగించగా వారిని రైతులు అడ్డుకున్నారు. ఆ సమయంలో అక్కడకి వచ్చిన జడ్పీటీసీ వర్రి నర్సింహంమూర్తి, నాయకులు పీరుబండి జైహింద్‌కుమార్‌లతో తహసీల్దార్, సీఐ, ఎస్ఐలు చర్చించారు. వరి చేను కోతలు అయ్యే వరకూ సమయం ఇవ్వాలని నాయకులు కోరారు. అంతవరకూ గడువు ఇవ్వలేమని తహసీల్దార్ స్పష్టం చేశారు. దీంతో మరోసారి పశువుల శాలలు తొలగించడానికి ప్రయత్నం చేయడంతో రైతులు అడ్డుకున్నారు.చివరికి 12 గంటల సమయంలో హైకోర్టులో రెవెన్యూ వ్యవహారాలు చూస్తున్న అడ్వకేట్ నుంచి తహసీల్దార్‌కు యథాతథస్థితి కొనసాగించాలని స్టేపై సమాచారం వచ్చింది. దీంతో అధికారులు ఎక్కడి పనులు అక్కడే నిలిపివేసి వెనుతిరిగారు. కాగా ప్రస్తుతం ఎలా ఉన్న పరిస్థితి అలా ఉంచాలని, కోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయని ,కోర్టు ఉత్తర్వులను అనుసరించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు.



నాయకులతో చర్చిస్తున్న తహసీల్దార్, సీఐ, ఎస్ఐలు



బాబాకి చందనం, పూలు సమర్పిస్తున్న అశోక్ గజపతిరాజు, కుటుంబసభ్యులు

దర్గాను దర్శించుకున్న గోవా గవర్నర్

విజయనగరం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కోట ఎదుట ఉన్న డంకేషావలీబాబా దర్గాను గురువారం గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీలా గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు సందర్శించారు. వీరికి దర్గా కమిటీ ప్రతినిధులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం బాబాకి చందనం, పువ్వులను అశోక్ గజపతిరాజు కుటుంబసభ్యులు సమర్పించారు. టీడీపీ మైనార్టీ విభాగం నాయకులు పాల్గొన్నారు.



పాఠశాల నిర్వహణకు పాక ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పాఠశాల కోసం పాక ఏర్పాటు

- మారికలో గిరిజన విద్యార్థులకోసం ఉపాధ్యాయుడి తోడ్పాటు

వేపాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకవలస శివారు గిరిశిఖర గ్రామం మారిక గిరిజన విద్యార్థుల కోసం భవనం లేకపోవడంతో ఉపాధ్యాయుడు తన సొంత ఆర్థిక వనరులతో పాక ఏర్పాటుకు ముందుకొచ్చారు. గిరిజన విద్యార్థులకు తోడ్పాటు నిచ్చారు. గ్రామస్థుల సమాచారం మేరకు.. గతంలో ఉపాధ్యాయులు సక్రమంగా వెళ్లేవారుకాదు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఆ గ్రామానికి ఉపాధ్యాయుడిగా తాడి రాంబాబు బాధ్యతలు చేపట్టారు. రాంబాబు ఉపాధ్యాయుడిగా చేరిన తర్వాత విద్యార్థుల హాజరు పెరిగింది. గిరిశిఖర గ్రామం కావడంతో మారిక గ్రామానికి చేరుకునేందుకు మైదాన ప్రాంతం కరకవలస నుంచి సుమారు 11 కిలోమీటర్ల కొండ రహదారిలో నడిచివెళ్లాలి. ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరమై నా రాంబాబు పాఠశాలకు సకాలంలో చేరుకొని విద్యార్థులను సమీకరించుకొని బోధిస్తున్నారు. దీంతో గిరిజనుల్లో చదువుపై ఆసక్తి పెరిగి పాఠశాల నిర్వహణకు అనువుగా పాక నిర్మాణానికి పూనుకున్నారు. గిరిజనుల అంగీకారంతో రాంబాబు కొంతడబ్బులు వెచ్చించి పాక నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



వీసీలో పాల్గొన్న కలెక్టరు రామసుందర్ రెడ్డి

● అనధికార తయారీదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలి: కలెక్టరు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనుమతి లేకుండా బాణసంచాను విక్రయించినా, తయారు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు రామసుందర్ రెడ్డి ఆదేశించారు.గ్రామస్థాయిలో సైతం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలో నిర్వహిస్తున్న బాణసంచా విక్రయాలు,తయారీపై పోలీసు అగ్నిమాపక, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని మూడు డివిజన్లలో ముగ్గురు తయారీదారులు ఉన్నారని, 15 మంది హోల్ సేల్ విక్రయదారులు ఉన్నారని డీఆర్వో శ్రీనివాస్ మూర్తి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాణసంచాను ఏ స్థాయిలో విక్రయించినా అనుమతి తప్పనిసరిఅని చెప్పారు. హోల్‌సేల్ షాపులు, పోలీస్,ఫైర్,రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేయాలన్నారు. గ్రామాల్లో జరిపే విక్రయాలను వీఆర్వోలు తనిఖీ చేయాలని ఆదేశించారు.అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయలని, నీరు అందుబాటులో ఉంచాలని, ఫైర్ సిండర్లు ఏర్పాటుచేయాలని సూచించారు. సమావేశంలోని జిల్లా అగ్నిమాపక అధికారి రాంప్రసాద్, డీఎస్పీ వీర్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషిచేయాలి

సీజన్‌లు వ్యాధులు, మందులు పంపిణీ, ఆసుపత్రిల్లో పరిశుభ్రత, ఆసుపత్రిల్లో రోగా నిర్ధారణ సేవలు, దేవాలయాలు మౌలిక సదుపాయాలు ప్రధాన మంత్రి తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం రాత్రి కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలోని జిల్లాను అభివృద్ధిలో మొదటి ఐదు స్థానాలలో ఉండే విధంగా కృషి చేయాలని కోరారు.

నేడు టీడీపీ సమావేశం

విజయనగరం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరగనుంది. ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో పాటు, నగర, మండల నాయకులు పాల్గొనే ఈ సమావేశంలో టీడీపీ నగర, మండల కమిటీలు, అనుబంధ సంఘాల ప్రతినిధుల కమిటీల జాబితాను ప్రకటించనున్నారు.

నేటి నుంచి వీవోఏల సమ్మె

చీపురుపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తాము శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొనున్నట్లు గ్రామైక్యసంఘాల సహాయకులు(వీవోఏ)లు తెలిపారు మేరకు గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం అప్పలనాయుడుకు సమ్మె నోటీసును అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఆన్‌లైన్ పని భారాన్ని తగ్గించాల కోరారు.

● నెల్లిమర్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు చెల్లించాలని గ్రామైక్య సంఘాల సహాయకులు, సీసీలు వెలుగు ఏపీఎం సురేష్‌కుమార్‌కు మండల సమాఖ్య అధ్యక్షురాలు మనూజ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శృంగవరపుకోట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయంకలగనుంది. విద్యుత్ సరఫరా మెరుగు పరిచేందుకు నిర్వహించనున్న పనుల దృష్ట్యా రామనగర్, యడ్ల వీధి, బాలికల ఉన్నత పాఠశాల, కాపు వీధి, చింతా వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్, ముత్యాలమ్మ ఆలయం, విశాఖ డెయిరీ, మల్లిపూడి స్టోన్ క్రషర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు.

● డెంకాడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సాంకేతిక పనులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని గొలగాం,మన్యం,గంట్లాం ఎస్సీ కాలనీ,డి.తాళ్లవలసల్లో శుక్రవారంఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు విద్యుత్‌సరఫరానిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

13 వరకూ గ్రామీణ బ్యాంకు సేవలకు అంతరాయం

లక్కవరపుకోట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంకు సేవలకు ఈనెల 13 వరకు అంతరాయం కలుగుతుందని స్థానిక బ్యాంకు మేనేజర్ వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఆంధ్రప్రగతి, సప్తగిరి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాశ్, చైతన్యగోదావరిగ్రామీణ బ్యాంకులను మేలో ఆర్‌బీఐ విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంకుగా అవతరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సాఫ్‌వేర్ సొల్యూషన్స్ అంతరాయం వల్ల ఈనెల 13 ఉదయం 10 గంటల వరకు గ్రామీణ బ్యాంకుల్లో సేవలకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మైనింగ్ బ్లాక్‌పై సర్వే

గరివిడి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో మందిరివలస మైనింగ్ బ్లాక్‌పై రెవెన్యూ అధికారులు ఐదు రోజుల నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ మైనింగ్ బ్లాక్ పరిధిలో మందిరవలస, బాగువలస, ఆవగూడెం గ్రామాలు ఉన్నాయి. చెన్నైకు చెందిన విల్‌మిల్ రిసోర్స్ ప్రైవేటు లిమిటెడ్ మూడు గ్రామాలకు సంబంధించి సుమారు 750 ఎకరాల్లో మైనింగ్ కార్యక్రమాలు చేపట్టేందుకు మైనింగ్ బిడ్ వేసింది.దీంతో జిల్లా ఏడీ మైన్స్ అధికారుల నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు గరివిడి ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వో తదితరులు మూడు గ్రామాల్లోనూ సర్వే నిర్వహిస్తున్నారు.

కాన్షీరామ్‌కు నివాళి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని బహుజన సమాజ్ వాదీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 19వ వర్ధంతి పురస్కరించుకుని గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు సోము రాంబాబు, ప్రతినిధులు బోని రాంబాబు, ఎం ప్రకాష్‌రావు, పి శంకరరావు, కృష్ణ, చిరంజీవి, గబ్బర్ పాల్గొన్నారు,

కార్మికులకు చెక్కుల పంపిణీ

గరివిడి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఫేకర్ యాజమాన్యం తమ పరిశ్రమలో పనిచేసిన కార్మికులకు సెటిల్‌మెంట్‌కు సంబంధించిన డబ్బులను చెక్కుల రూపంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు సమక్షంలో పంపిణీచేశారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు బలరాం, సారిపాక సురేష్‌కుమార్, సూర్యనారాయణ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మురళీమోహన్, అదితిగజపతిరాజు

అశాంతి రేకెత్తించేందుకు వైసీపీ కుట్ర

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం/విజయనగరం రూరల్,అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అశాంతిని రేకెత్తించే విధంగా వైసీపీ కుట్రలకు తెరలేపుతోందని రాజాంఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్ప మండలంలోని దేవళంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నాయకులు నిప్పు పెట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కుట్రలు చేశారని పేర్కొన్నారు.ఈ మేరకు గురువారం విజయనగ రంలోని బాలాజీ కూడలి వద్ద ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, కూటమి నేతలు దళిత నాయకులతో కలిసి మురళీమోహన్ అంబేడ్కర్ విగ్రహానికి పైలమాలవేసి నివాళు లర్పించారు, టీడీపీ ఎస్సీసెల్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఎస్‌సీ సెల్ నాయకులు మామిడి రవిశంకర్, మైలిపిల్లి పైడిరాజు, రొంగలి పోతన్న పాల్గొన్నారు.



పార్వతీపురం: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విజయచంద్ర

వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ: ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహంపై దాడితో వైసీపీ దళితులు వ్యతిరేక పార్టీ అని స్పష్టమైందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆరోపించారు. పార్వతీపురంలో గురువారం అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేసిన అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో వైసీపీనాయకులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటననుఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఆయన సిద్ధాంతాలపై దాడిగా దళితులంతా భావిస్తున్నారన్నారు. ఆయన విగ్రహాన్ని ధ్వంసం చేసిన వైసీపీ నాయకులను క్షమించరాదని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు అనేక అకృత్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి రాస్తారోకో నిర్వహించారు.

రెస్కోను పునరుద్ధరించండి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):చీపురుపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘాన్ని(రెస్కో) పునరుద్ధరించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు కోరారు. గురువారం చీపురుపల్లిలోని ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో 30 మంది వినియోగదారులు తమ సమస్యలపై చైర్‌పర్సన్ బి. సత్యనారాయణకు వినతిపత్రాలను అందజేశారు. ఓల్టేజీ సమస్యలను పరిష్కరించాలని, అధిక బిల్లుల సమస్యలను పరిష్కరించాలని చీపురుపల్లి, గరివిడి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది వినియోగదారులు కోరారు. ఈసందర్భంగా రామ్‌మల్లిక్‌నాయుడు విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌ఈసీఎస్ కార్యకలాపాలు ఈపీడీసీఎల్ పరిధిలోకి వెళ్లడం వల్ల రైతులు, ఇతర కేటగిరీల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు బి. సులేఖ రాణి, ఎస్.సుబ్బారావు, ఈఈ పి.మురళీకృష్ణ, డీఈ పి.త్రినాథరావు, చీపురుపల్లి ఏఈ ఎస్. విశ్వేశ్వరరావు, గరివిడి ఏఈ సన్యాసినాయుడు, ఆర్‌ఈసీఎస్ జేఏవో ఎస్. రాధాకృష్ణ, కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన

గుర్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని కెల్లలో రూ.1.24 కోట్ల వ్యయంతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులను జిల్లా అధికారుల బృందం గురువారం పరిశీలించింది. జడ్పీ సీఈవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ కవిత, డీపీవో మల్లిఖార్జునరావుల ఆధ్వర్యంలో కెల్లబీసీకాలనీలో స్కూల్‌వీధిలో కొళాయిలను పరిశీలించారు.కార్య క్రమంలో డీఈఈ శ్రీలత, ఎంపీడీవో రవికుమార్, ఏఈ సత్యం, సర్పంచ్ కెల్ల లక్ష్మి పాల్గొన్నారు.

●మెరకముడిదాం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాంలో చేపట్టిన జేజేఎం పనులను సీఈవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ కవితా పరిశీలించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: జేసీ

కొమరాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం పలు ఆశ్రమ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొమరాడగిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల, ఉలిపిరి ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థుల నివాస గృహాలు, వంటశాల పరిశుభ్రత పరిశీలించారు.

● పార్వతీపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లా ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్తున్న పిల్లలంతా వ్యక్తిగత శుభ్రతను అలవాటు చేసుకోవాలని జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సూచించారు. కురపాం గురుకుల పాఠశాల విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్న అనంతరం 24 మంది డిశ్చార్జ్ కావడంతో వారిని జేసీ కలిశారు. కార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి, జిల్లా ఆసుప త్రుల సమన్వయ అధికారి జి.నాగభూషణరావు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం రూ.17.98 లక్షలు

పాలకొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని కోటదుర్గమ్మ ఆలయంలో హుండీలను గురువారం లెక్కించారు. జిల్లా దేవదాయశాఖాధికారి ఎస్.రాజారావు సమక్షంలో ఆలయ తనిఖీదారు ఎస్.రామారావు, జూనియర్ అసిస్టెంట్ బి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ సమక్షంలో హుండీలను తెరిచారు. 15 హుండీల ద్వారా 46 రోజులకు రూ.17,98,058 ఆదాయం సమకూరింది. అలాగే మిక్స్‌డ్ బంగారు 20గ్రాములు, వెండిరెండు కేజీల 50 గ్రాములు అమ్మవారికి భక్తులు కానుకలు సమర్పించినట్లు గుర్తించారు.

పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న రాధాకృష్ణ

ఎస్.కోట రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పాడిరైతులు ప్రభుత్వం అందజేస్తున్న పథ కాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ రాధాకృష్ణ కోరారు. గురువారం రేవళ్లపాలెంలో మండల పశువైద్యాధికారి రామ్ కుమార్ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్సశిబిరం నిర్వహిం చారు.ఈసందర్భంగా రైతులకు అవగాహనసదస్సు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ చలపతిరావు, సర్పంచ్ కృష్ణమ్మ పాల్గొన్నారు.

అనుమతులు లేని వాటర్‌ప్లాంట్ల మూత

● ఎస్.కోటలో జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి నాగూల్ మీరా తనిఖీలు

శృంగవరపుకోట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోట ఒన్‌వే ట్రాఫిక్ సమీపంలో గల ఐశ్వర్య డ్రింకింగ్, పుణ్యగిరి రోడ్డులోని శ్రీదారగంగమ్మతల్లి రోహి వాటర్ ప్లాంట్లకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అనుమతులు లేకపోవడంతో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి నాగూల్ మీరా మూసివేయించారు. గురువారం ఎస్.కోటలోని వాటర్‌ప్లాంట్లను తనిఖీచేశారు. ప్లాంట్లకు వున్న అనుమతులు చూపించాలని యజమానులను కోరారు. ఏడాది కిందట నుంచి ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అనుమతి పొందాలని చెబుతున్నా పట్టించుకోలేదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అనుమతి పొందేవరకు ప్లాంట్లను తెరవద్దని ఆదేశించారు. అనంతరం పుణ్యగిరి రోడ్డులోని సబ్ జైలు ఖైదీలకు వండే వంట సరుకులను పరిశీలించారు. నాసిరకం కందిపప్పు వాడోద్దని, మెదటి రకం కంది పప్పును వాడాలని సూచించారు. స్థానికుల పిర్యాదు మేరకు విశాఖ-అరకు రోడ్డులో గల మిస్సెస్ లక్ష్మీ నారాయణ ట్రెడర్స్‌ను తనిఖీ చేశారు. అక్కడ డబ్బాల్లో వున్న ఆయిల్ శాంపిల్‌ను సేకరించి, హైదరాబాద్‌లోని నాచారం పంపిస్తామని చెప్పారు. అక్కడ నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఈ ట్రేడర్స్ యజమానిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఎస్.కోటలో వాటర్‌ప్లాంట్‌ను మూసేస్తున్న నాగూల్ మీరా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గజపతినగరం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమిస్తే అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్.ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని ఎం. వెంకటాపురంలో డీలర్ షాపును తనిఖీ చేశారు. డీలరుప్రతాప్‌ను రేషన్ డిపోకు సంబంధించిన బియ్యంపై అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎం. వెంకటాపురం అంగన్‌వాడీ -1 కేంద్రాన్ని పరిశీలించారు కార్య క్రమంలో డీఎస్‌వో మురళీనాథ్, డీఎం కార్యాలయం ఏఈ ఎం. వెంకటరావు, ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి ఈశ్వరరావు తిరుపతిరావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో చికెన్ కోసం కొట్లాట

కొత్తవలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మద్యం మత్తులో చికెన్ కోసం కొట్లాట చోటుచేసుకుంది. ఓ వ్యక్తిని కూరగాయల చాకుతో పొడవడంతో తీవ్ర గాయాలకావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. సీఐ షణ్ముఖరావు కథనం మేరకు.. కొత్తవలస మంగళవీధిలో నివాసముంటున్న జంగంపల్లి ప్రసాద్, సూరిశెట్టి రవితేజ స్నేహితులు. బుధవారం ఇద్దరు మద్యం సేవించారు. ప్రసాద్‌జేబులోని 100 రూపాయలను తీసుకుని రవితేజ చికెన్ కొనుగోలు చేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. తన డబ్బులతో రవితేజ చికెన్ కొనుక్కుని వెళ్లిపోవడంతో ఆగ్రహంతో ఉన్న ప్రసాద్ రవితేజ కొన్న చికెన్ లాక్కొని ఇంటికి పట్టుకు వెళ్లిపోయాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన రవితేజ కూరగాయల చాకుతో ప్రసాద్ ఇంటికి వెళ్లి తీవ్రంగా ప్రసాద్‌ను గాయపరిచాడు. ఈమేరకు గాయపడిన ప్రసాద్‌ను విశాఖపట్టణంలోని కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రసాద్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జమ్ము ఘటనలో కోర్టు ఎదుట ఐదుగురు లొంగుబాటు

గుర్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్ములో పోలీసులపై వైసీపీ కార్యకర్తల దాడి కేసులో మరో ఐదుగురు కోర్టు ముందు లొంగిపోయినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. గ్రామంలో దేవి విగ్రహం నిమజ్జనం సమయంలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ మేరకు రెండు రోజుల కిందట 20 మందిని విశాఖ జైలుకు తరలించారు. ఈ కేసులో సువ్వాడ బంగారునాయుడు, జమ్ము శివ, చింతపల్లి సూరిసత్యం, సువ్వాడ సూర్యనారాయణ, సారంపాట ఆనంద్ గురువారం చీపురుపల్లి జేఎఫ్‌సీఎం కోర్టులో లొంగిపోయారు. లొంగిపోయినవారిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

విజయనగరం క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):తెర్లాం పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బి.నాగభూషణం కుటుంబానికి పోలీసుశాఖ అండగా నిలిచింది. ఈ మేరకు జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సేకరించిన లక్షా 48,600 చెక్కును నాగభూషణం భార్య ధనలక్ష్మికి ఎస్పీ ఏఆర్ దామోదర్ అందజేశారు. కార్యక్రమంలో ఏవో వి.శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ పి.రామకృష్ణ, అడహక్ కమిటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్,అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):జిందాల్ యాజమాన్యం తమకు న్యాయం చేయాలని 111రోజులుగా పోరాటం చేస్తున్న ఏఒక్కరు స్పందించడం లేదని, ఈ విషయంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ కల్పించుకోని న్యాయం చేయాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. గురువారం బొడ్డవరలో నిర్వహించిన రిలేదీక్ష శిబిరంలో వారు మాట్లాడుతూ అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి మాట నమ్మి భూములిస్తే సదరు పరిశ్రమ యాజమాన్యం కంపెనీ ఏర్పాటుచేయకుండా నిలువున ముంచిందని వాపోయారు.



బొడ్డవర వద్ద నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

● తండ్రిని హత్యచేసిన కుమారుడు



రాజేశ్వరరావు (ఫైల్)

బాడంగి,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): కుమారుడే కాలయముడయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వడానికి నిరాకరించిన తండ్రిని కుమారుడే హతమార్చాడు. బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు కథనం మేరకు.. మండల కేంద్రంలోని సినిమాహాల్ కాలనీలో నివాసముంటున్న భువనగిరి రాజేశ్వరరావు (68) చాపలు కుట్టుకుని జీవనం సాగిస్తున్నా డు. అతనికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తె ఉండగా పెద్దకుమారుడు గతంలో మృతిచెందాడు.రెండో కుమారుడు లక్ష్మణరావు పె యింటింగ్ పనులకు వెళుతుంటాడు. మద్యానికి బానిసఅయ్యాడు. గురువా రం మద్యం తాగేందుకు తండ్రికిలక్ష్మణరావు డబ్బులుఅడిగాడు. దాంతో డబ్బు లు ఇచ్చేందుకు తండ్రి నిరాకరించాడు. ఆగ్రహానికి గురైన లక్ష్మణరావు చాప లు కుట్టే గూటంతో తండ్రి తలపై బలంగా కొట్టాడు. దాంతో అక్కడికక్కడే రాజేశ్వరరావు మృతిచెందాడు.మృతుడిభార్యఉమా సమాచారం మేరకు ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. కాగా మృతుడు రాజేశ్వరరావు స్వగ్రామం బలిజిపేట కాగా జీవనోపాధి కోసం బాడంగి వచ్చి చాపలు కుట్టుకుంటూ జీవిస్తున్నాడు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ భవ్యారెడ్డి పరిశీలించారు. ఎస్ఐ తారకేశ్వరరావు కేసు నమోదు చేశారు. నిందితుడు లక్ష్మణరావును అదుపులోకి తీసుకున్నారు. స్థానిక సీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో వ్వేర్వేరు ఘటనల్లో గురువారం నలుగురు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో భర్త..

సీతానగరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 36వ అంతర్రాష్ట్ర రహదారి ఫ్లైఓవర్‌పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబటి సుధాకర్ (46) మృతి చెందారు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. పెదభోగిలి పంచాయతీ అప్పయ్యపేటకు చెందిన సుధాకర్ తన భార్య కల్యాణితో కలిసి సీతానగరం నుంచి అప్పయ్యపేటకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పార్వతీపురం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వారిని ఢీకొంది. దాంతో భార్యా భర్తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రికి తరలించే సరికి సుధాకర్ మృతి చెందారు. మృతుని భార్య అపస్మారక స్థితిలో ఉంది. ఈ ఘటనపై సీతానగరం ఎస్ఐ ఎం.రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి ఒకరు..

గరుగుబిల్లి,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): రావుపల్లి గ్రామానికి చెందిన సంగాపు చంద్రశేఖరరావు (45) చెరువులో జారిపడి మృతి చెందారు. ఎస్ఐ ఫక్రుద్దీన్ కథనంమేరకు..గ్రామంలోని శివాలయంలో పూజారిగా చంద్రశేఖరరావు కొన సాగుతున్నారన్నారు. బుధవారం రాత్రి స్నానానికై బోటువాని చెరువులో దిగే క్రమంలో కాలు జారి పడి మృతిచెందారన్నారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు నమోదు చేశామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించామన్నారు. మృతుడికి భార్య మంగమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నిర్మాణంలోని ఇంటి గోడ కూలి..

బొబ్బిలి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపల్లి జంక్షన్‌లో గురువారం నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలిన ఘటనలో తోణంగి అప్పయ్యమ్మ (49) మృతిచెందింది. స్థానిక కోరాడ వీధికి చెందిన లక్కోజు శ్రీనివాసరావు గొల్లవీధి జంక్షన్‌లో ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఆ ఇంటికి రెండు పక్కల ఇళ్ల గోడలతో ప్రమేయంలేకుండా 15 రోజుల క్రితం గోడలను ప్రత్యేకంగా నిర్మించారు. పొరుగింటి గోడకు, కొత్తగా నిర్మించిన గోడకు మధ్య గల కొద్దిపాటి ఖాళీ స్థలాన్ని మట్టితో పూడ్చారు. అలా పూడ్చిన గోడల మధ్య సందులో నీటిని నింపారు.దాంతో కొత్తగా నిర్మిస్తున్న గోడ ఒక్కసారిగా పని చేస్తున్న అప్పయ్యమ్మపై కూలడంతో అక్కడిక్కడే మృతిచెందింది. అదే సమయంలో అక్కడ పనిచేస్తున్న బాడంగి మండలం పినపెంకికి చెందిన పిల్లా రామలక్ష్మి, పిరిడికి చెందిన రామినాయుడులకు గాయాలయ్యాయి. విషయం గమనించిన స్థానికులు ముగ్గురిని కాపాడే ప్రయత్నంచేశారు.అప్పటికే అప్పయ్యమ్మ మృతి చెందగా, గాయపడ్డ ఇద్దరిని ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ కటకం సతీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. గాయపడ్డ వారిని ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ ఘటనపై ఎస్ఐ రమేష్ కేసు నమోదుచేశారు. అప్పయ్యమ్మ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలు అప్పయ్యమ్మ స్థానిక కొత్త ఎరుకలివీధిలో నివాసం ఉంటోంది. ఆమెకు కుమారుడు ఉన్నారు.

పురుగు మందు తాగి ..

వీరఘట్టం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిదిమి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బౌరోతు సాయి (23) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయికి కాంచనతో 13 నెలల కిందటవివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు కారణంగా బుధవారం మధ్యాహ్నం సాయి పురుగు మందు తాగాడు. చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రులు బౌరోతు మోహనరావు, విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు.

చావు అంచుల వరకు వెళ్లి..

● ఎస్.కోటలో రైలు పట్టాలపై నిల్చొన్న యువకుడు



గణేష్(ఫైల్)

శృంగవరపుకోట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు మృత్యుంజయుడిగా నిలిచాడు. చావు అంచుల వరకూ వెళ్లి బయటపడ్డాడు. ఆయనపై నుంచి రెండు రైళ్లు వెళ్లిన ఘటనలో చావు నుంచి తప్పించుకున్నాడు. ప్రస్తుతంవిశాఖలోని ఓఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు.ఈ ఘటన ఎస్.కోట పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పోతనాపల్లికి చెందిన పొట్నూరు గణేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం రాత్రి కుటుంబంలో చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. మనసస్థానానికి గురయ్యాడు. దీంతో అదేరోజు రాత్రి10.30గంటల సమయంలో ఎస్.కోట పుణ్యగిరి రోడ్డు సమీపంలోని రైలుపట్టాలపై నిల్చొన్నాడు. ఎదురుగా వచ్చిన రైలు ఢీకొనడంతో పక్కనఉన్న పట్టాలపై పడ్డాడు.ఒకకాలు నుజ్జుయిపోయింది.ఇంతలో ఆయన రెండోవైపు పడిన పట్టాలపైన మరో రైలువెళ్లింది. అయితే ఈ పట్టాల మధ్యన ఆయన తిన్నగా పడిఉండడంతో శరీర భాగాలు రైలుకు తగల్లేదు. దీంతో ప్రమాదంనుంచి తప్పించుకున్నాడు.గాయపడిన గణేష్ చూసిన సమీపంలోని కాలనీ వాసులు విశాఖలోని ఆసుపత్రికి తరలించారు.

మంగళపాలెంలో భవనంపై పిడుగు

కొత్తవలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళపాలెంలోని యాతపేటలో గల నేలమ్మగారి వీధిలో సిమ్మపైడిరాజు, కాసులమ్మ దంపతుల ఇంటిపై గురువారం మధ్యాహ్నం పిడుగుపడింది. స్థానికులు, బాధితుల కథనం మేరకు.. పిడుగుపడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వారిద్దరూ మధ్యాహ్నం పొలం పనులకు వెళ్లారు.ఆ సమయంలో ఉరుములుతో కూడిన వర్షం కురవడంతో పిడుగులు ఇంటిపై పడడంతో గోడలు బీటలు వారాయి. పైకప్పుకు పెద్ద రంధ్రం పడింది. మూడు ఫ్లోర్లలోని విద్యుత్ వైర్లు, ఇంట్లోని ఫ్యాన్లు, ఫ్రిజ్, టీవీ, ఇన్వర్టర్, లైటు కాలిపోయాయి. ఈప్రమాదంలో సుమారు ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇంటిపై పిడుగు పడిన విషయాన్ని చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో పైడిరాజు, కాసులమ్మ చేరుకుని విలపించారు.

● బొండపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లాంలో సింగవ రపు నారాయణరావు ఇంటిపై పిడుగు పడడంతో ఆయనతోపాటు మరొకరి గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి వద్ద సిమెంట్‌పై పరదా వేసే సమయంలో పిడుగు పడడంతో తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయాడు. ఈ మేరకు వారికి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

తొమ్మిది మద్యం సీసాల స్వాధీనం

బొండపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):మండలంలో పలు అనుమానిత ప్రదేశాల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె.జనార్దనరావు ఆధ్వర్యంలో దాడులునిర్వహించారు. ఈ మేరకు నెలివాడలో తొమ్మిది మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని వి.వెంకటరావుపై పోలీసులు కేసునమోదుచేశారు.దాడుల్లో ఎస్ఐ పి.నరేంద్రకుమార్, హెచ్‌సీలు ఎండీజే.బాషా,లోకాభిరామ్, కానిస్టేబుల్ వి.అప్పారావు ఉన్నారు.

పోరు.. జోరు

(ఐదో పేజీ తరువాయి)

వివరాలను ఇప్పటి అధికారులు కోర్టులకు, కమిషన్‌కు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించడంలో అనేక అవస్థలు పడుతున్నారు. ఈ భూములను అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులను ఒప్పించి తీసుకున్నవి కావడంతో రికార్డులు సక్రమంగా లేవు. దీంతో నివేదికలు తయారు చేసేందుకు రెవెన్యూ అధికారులు పడుతున్నపాట్లు అన్నీ ఇన్నీకావు. ఇక పోలీస్‌ల పరిస్థితి మరోలా ఉంది. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిందాల్‌కు అప్పగించిన భూముల్లో పోలీస్ పహారా పెట్టారు. వాటి వద్దకు నిర్వాసిత రైతులను వెళ్లనివ్వడం లేదు. నిర్వాసిత రైతుల పోరాటానికి మద్దతు ఇస్తున్న వారిని పోలీస్ స్టేషన్‌కు పిలుస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చోబెడుతున్నారు. జిందాల్ యాజమాన్యానికి అనుకూలంగా పోలీస్‌లు వ్యవహరిస్తున్నారని భూ నిర్వాసిత రైతులు బహాటంగానే చెబుతున్నారు.

అలా మొదలై.. ఇలా

జిందాల్ యాజమాన్యం అల్యూమినియం శుద్ధికార్మాగారంతో పాటు రిఫైనరీ, విద్యుత్ పవర్ ప్లాంట్లు నిర్మిస్తామంది. ఇందుకోసం శృంగవరపుకోట మండలం కిల్తంపాలెం, ముషిడిపల్లి, చీడిపాలెం, చినఖండేపల్లి, మూలబొడ్డవర గ్రామాల్లో 180.73 ఎకరాల జిరాయితీ భూములతో పాటు 151.04 ఎకరాల ప్రభుత్వ, 834.66 ఎకరాల అసైన్డ్ భూములను 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమకు అప్పగించింది. ఈ భూములు పొందిన ఇన్నాళ్లకు ప్రతిపాదిత పరిశ్రమ కాకుండా ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణానికి 2023 నవంబర్‌లో ఇండస్ట్రియల్ కామర్స్ డిపార్టుమెంట్ నుంచి అనుమతులు పొందారు. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణానికి కూడా ముందుకు రాలేదు. 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ భూముల్లో చిన్నసూక్ష్మమధ్య తరహా పరిశ్రమలను నిర్మించాలని భావించింది. ఇందుకు ముందుకెళ్లేతరుణంలో జిందాల్ భూనిర్వాసితులు రోడ్డెక్కారు. ముందు తమ సమస్యలను పరిష్కరించాలని, పరిశ్రమ యాజమాన్యం భూములు తీసుకున్నప్పుడు తమకిచ్చిన హామీల పరిస్థితి ఏమిటో చెప్పాలని పట్టుబడుతున్నారు.

మైనర్లు అని మర్చిపోవద్దు

(ఐదో పేజీ తరువాయి)

ఆకులు పట్టుకున్న చందంగా ప్రమాదాలు జరిగి మూల్యం చెల్లించుకున్న తరువాత అయ్యో పాపం అని బాధపడుతున్నారు. సాధారణంగా ద్విచక్ర వాహనం ప్రతి ఇంటికీ అవసరమే. కానీ పిల్లలు కోరిందే తడవుగా స్పోర్ట్స్ బైక్‌లు కొనిచ్చేస్తున్నారు. ఇలా బైక్‌లు సమకూర్చిన తరువాత చాలా మంది పిల్లలపై దుష్ప్రభావం పడుతోంది. వారు పక్కదారి పడుతున్నారు.

బైక్ రైడింగ్‌ల జోరు..

సోషల్ మీడియా ప్రభావంతో ఎక్కువ మంది బైక్ రైడింగ్‌పై మక్కువ పెంచుకుంటున్నారు. స్పోర్ట్స్ బైక్‌లు కొనుగోలు చేస్తున్నారు. మధ్యతరగతి, ఆపై ఉన్నత కుటుంబాల్లో ప్రతి ఇంటా రేస్‌బైక్‌లు, స్పోర్ట్స్ బైకులు దర్శనమిస్తున్నాయి. జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధి కుమారుడు బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. చాలా రోజుల పాటు ఆస్పత్రికే పరిమితమయ్యాడు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. కన్నవారికి అంతులేని విషాదాన్ని మిగిల్చాడు. పాలకొండకు చెందిన ఓ నేత కుమారుడు అప్పట్లో ఇదే విధంగా బైక్ ప్రమాదానికి గురై చనిపోయాడు. తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..

మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదు. వాటికి వీలైనంత వరకూ దూరంగా ఉంచాలి. ఇటీవల సోషల్ మీడియా ప్రభావంతో ఎక్కువ మంది పిల్లలు బైక్ రైడింగ్‌పై ఆసక్తి పెంచుకుంటున్నారు. అందువల్లే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి.

-కె.అశోక్‌మార్, సీఐ, రాజాం

గాడిన పడేదెప్పుడు?

(ఐదో పేజీ తరువాయి)

పట్టుకున్నట్టు తేలింది. ఇప్పటికీ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోతోంది. వైసీపీ హయాంలో జిల్లా నుంచి కాకినాడ పోర్టుకు బియ్యాన్ని అక్రమంగా తరలించేవారు. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో దళారులు ఉన్నట్టు అప్పట్లో ప్రచారం నడిచింది. వీరంతా గ్రామాల్లో మధ్యవర్తులను ఏర్పాటుచేసుకొని బియ్యాన్ని సేకరించేవారు. ప్రతినెలా వేల క్వింటాళ్లో తరలించేవారని తెలుస్తోంది. అయితే ఇప్పటికీ ఈ బియ్యం దందా అలానే కొనసాగుతోందన్న వార్తలు వస్తున్నాయి.

రేషన్ తరలిపోతోంది అలా..

రేషన్‌కార్డుదారులు 25 శాతం మంది బియ్యాన్ని విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. కిలో రూ.13 నుంచి రూ.15 వరకూ కొనుగోలు చేస్తున్న మధ్యవర్తులు వాటిని రూ.20కు అమ్ముతున్నట్టు తెలుస్తోంది. అయితే గతం మాదిరిగా కాకినాడ పోర్టుకు తరలించలేకపోతున్నారు. పోలీస్ నిఘా పెరగడంతో అక్రమార్కులు రూటుమార్చారు. అందుకే స్థానిక మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అటు మిల్లర్లు సైతం వాటినే లెవీగా చూపుతున్నారు.

ఇన్‌చార్జి మంత్రి ఆదేశాలు బుట్టదాఖలు..

మొన్న ఆ మధ్య డీఆర్‌సీ సమావేశంలో వైసీపీ హయాంలో పౌర సరఫరాల శాఖ అధికారిగా పనిచేసిన వ్యక్తిపై సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. కానీ నెలలు గడుస్తున్నా ఈ విచారణ ఎంతవరకు వచ్చిందో తెలియని పరిస్థితి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఆమె ఎనిమిది నెలల పాటు అదే పోస్టులో కొనసాగారు. ఆమె హయాంలో పౌర సరఫరాల శాఖలో భారీగా అవినీతి జరిగినట్టు ఆరోపణలు న్నాయి. మిల్లర్లతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు జిల్లాలో ప్రధానంగా వినిపించేవి. అందుకే రైతులను అప్పట్లో మిల్లర్లు లెక్కచేసేవారు కాదు. అటువంటి అధికారిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమ వుతోంది.

సన్నబియ్యంలోనూ మాయ

సన్నబియ్యం అమ్మకాల్లోనూ అదే మాయను కొనసాగిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సన్నబియ్యంగా కొందరు మిల్లర్లు చూపుతున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసే రేషన్ బియ్యాన్ని సాంబమసూరి వంటి బ్రాండెడ్ బియ్యంలో కలిపి విక్రయిస్తున్నారు. సన్నంగా మరపట్టడంతో వినియోగదారులు సైతం గుర్తించలేక మోసపోతున్నారు. అటు తూకం దగ్గర సైతం ఇదే పరిస్థితి. 25 కిలోలు ఉండే ప్యాకెట్‌లో ఉండేది 23 కిలోలే. రెండు కిలోలు తరుగును చూపిస్తుంటారు. ఇటు బియ్యం నకిలీతో పాటు తూకంలో సైతం వినియోగదారుడు నష్టపోవాల్సి వస్తోంది.

గోధార్

(ఐదో పేజీ తరువాయి)

గొర్రెలు 4,48,154, మేకలు 1,56,511 ఉన్నాయి. గోధార్‌ను పాడి పశువులవరకు పరిమితం చేస్తారు. గొర్రెలు,మేకలు కూడా వర్తింపజేస్తారా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు.

సిద్ధంగా ఉన్నాం

గోధార్‌పై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడిన వెంటనే ప్రక్రియ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.ప్రస్తుతం తిరుపతిరి పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకున్నారు.ఫలితాలను బట్టి దవలవారీగా అన్ని జిల్లాల్లో ప్రారంభించే అవకాశం ఉంది.గోధార్ వల్ల పాడి రైతులకు మేలు జరుగుతుంది. **- మురళీకృష్ణ, జేడీ, జిల్లా పశుసంవర్ధక శాఖ**

'స్పేస్ టెక్నాలజీ' విజేతలకు బహుమతులు



విజేతలతో కళాశాల అధికారులు

బొబ్బిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా స్థానిక రాజా కళాశాలలో గురువారం రెండో రోజు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. బొబ్బిలి, పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్విజ్, వ్యాసరచన, సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలలో పాల్గొన్నారు. అన్ని విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్న వారందరికీ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. విజేతలందరినీ షార్ కంట్రోలర్ అండ్ డిప్యూటీ డైరెక్టరు జి.రమేష్‌బాబు, కళాశాల జాయింట్ సెక్రటరీ రావు బదరి, ప్రిన్సిపాల్ సీహెచ్. వీరేంద్రకుమార్, నిర్వాహక కమిటీ చైర్మన్ టి.హరికృష్ణ, కార్యదర్శి ఇ.ప్రదీప్‌నాయుడు అభినందించారు. అంతరిక్ష పరిశోధనలో ఇస్రో సాధించిన విజయాలు అంశంపై వ్యాసరచన పోటీలో కారాడ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, పెంట జడ్పీ హైస్కూల్, మెట్టవలస జడ్పీ హైస్కూల్, బొబ్బిలి ప్రభుత్వ బాలికల హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులను గెలుచుకున్నారు. అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి షార్ నుంచి మరి కొంతమంది అధికారులు, ప్రతినిధులు హాజరుకానున్నారని ప్రిన్సిపాల్ వీరేంద్రకుమార్ ఈసందర్భంగా తెలిపారు.

కళ్ల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

రాజాం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కళ్ల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ సప్పటి వసంత రావు సూచించారు. రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ కంటిదృష్టి దినోత్సవం పురస్కరించుకుని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్లను పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, వికాస తరంగిణి సెంట్రల్ కమిటి సభ్యులు టిటివి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

మండలంలోని కొఠారిపురం లో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 150 మందికి నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించి, కంటి అద్దాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్య క్రమంలో సర్పంచి బట్న అసిరి నాయుడు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఆవరణ జలమయం


కళాశాల ప్రాంగణంలోకి చేరిన వరదనీరు

గజపతినగరం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణ జలమయ మయ్యింది. గురువారం కురిసిన భారీ వర్షానికి నీరు చేయడంతో విద్యార్థులు, అధ్యాపకులు అవస్థలకు గురయ్యారు. గతంలో ఇక్కడ ఎంపీడీవో కార్యాలయం ఉండేది. కొత్తగా భవనం ఏర్పాటుకావడంతో ఆ భవనం ప్రస్తుతం డిగ్రీ కళాశాలకు వినియోగిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఆ భవనం చినుకు పడితే కారిపోతోంది.

రోడ్డు పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్

బొబ్బిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని సింగారపు వీధిలో గురువారం సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు గురువారం భూమి పూజ చేశారు. ఆ వీధిలో ఆర్చి నుంచి వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పనులు చేపట్టనున్నారు. ఈ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని శరత్‌బాబు అధికారులు, కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ పెదిరెడ్ల కిరణ్‌కుమార్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలరు లక్ష్మి, నాయకులు ఏగిరెడ్డి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా నిరుపయోగంగానే..


నిరుపయోగం ఉన్న అదనపు భవనం

బొబ్బిలి రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భోజరాజపురం ప్రాథమిక పాఠశాల కోసం నిర్మించిన భవనం వినియోగానికి దూరంగా ఉంది. పదేళ్ల కిందట అదనపు తరగతి భవనాన్ని నిర్మించారు. అయితే ఆ భవనం కిటికీలు ఊడిపోవడం, గచ్చులు కుంగిపోవడంతో అందులోకి పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. ఇప్పటికైనా ఆ భవనానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోని తీసుకురావాలని స్థానికులు కోరారు. ● ఈ విషయంపై హెచ్ఎం చెల్లంనాయుడును వివరణ కోరగా... అదనపు భవనం నిరుపయోగం ఉన్న విషయం మండల విద్యాశాఖాధికారులకు తెలియజేశానన్నారు.

అన్ని సంక్షేమ హాస్టళ్లకు ఒకే మెనూ


బొబ్బిలి గిరిజన ఆశ్రమపాఠశాల వంటగదిని పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

బొబ్బిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్ల, గురుకుల పాఠశాలల్లో జీవో నెంబరు 8 ప్రకారం విద్యార్థులకు ఒకే మెనూను అమలు చేయాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బొబ్బిలిలో సుడిగాలి పర్యటన చేశారు. అంగన్వాడీ కేంద్రాలు, రేషన్ డిపోలు, ప్రభుత్వ గురుకుల పాఠశాల, కేజీబీవీ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వామివారి వీధి, తారకరామా కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతో ఆయన మాట్లాడారు. రేషన్ డిపోల్లో సరుకుల సక్రమ పంపిణీపై ఆరా తీశారు. గురుకులం, గిరిజన ఆశ్రమపాఠశాలల్లో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొబ్బిలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో మెనూను పాటించడం లేదన్నారు. దాన్ని సహించేది లేదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ డిపోలు, సంక్షేమ హాస్టళ్ల, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఎక్కడైనా అన్యాయం జరిగితే 9490551117 వాట్సాప్ నెంబరుకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సంక్షేమ హాస్టళ్ల, గురుకులాల్లో గంజి వార్చి అన్నం పెట్టకూడదన్నారు. అలా చేస్తే అందులో ఉన్న పోషకాలు పూర్తిగా పోతాయన్నారు. చైర్మన్ వెంట డిప్యూటీ డీఈవో మోహనరావు, సీఎస్ డీటీ రెడ్డి సాయికృష్ణ, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి, గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ రఘునాథ్, ఏటీడబ్ల్యూవో, ఎంఈఓలు, చిప్పాడ రమేష్‌కుమార్, గొట్టాపు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్: మండలంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి గురువారం పర్యటించారు. తొలుగ మండల పరిషత్ కార్యాలయాన్ని చేరుకున్న ఆయన్ని డిప్యూటీ డీఈవో మోహనరావు, ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి స్వాగతం పలికారు. అనంతరం పలు వసతి గృహాలు, రేషన్ డిపోలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా పారాది జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో జిల్లా పౌరసరఫాల అధికారి జి.మురళీనాథ్, హెచ్ఎం నాగేశ్వరరావు, పీడీ నల్ల వెంకటనాయుడు తదితరులున్నారు.

●రామభద్రపురం: ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు ఆహారం అందించాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కాలం చెల్లిన కందిపప్పు ప్యాకెట్లను ఆయన గుర్తించారు. ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. పౌరసరఫరాల అధికారి వివరణ కోరారు. కందిపప్పు ప్యాకెట్లను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇటువంటి తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ పీవో వరాలమ్మను ఆదేశించారు. అనంతరం బూసాయవలస కస్తూరిబా పాఠశాలను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ హెచ్‌డీటీ సాయికృష్ణ, ఎంఈవో తిరుమలప్రసాద్ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కొత్తవలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై కోర్టులో విచారణ జరిగే సమయంలో న్యాయవాది కోర్టు రాకేష్ బూటు విసిరే ప్రయత్నం చేసినందుకు నిరసనగా కొత్తవలసలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. అలాగే సీపీఎం ఆధ్వర్యంలో కొత్తవలస జంక్షన్ ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు నిరసన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాజాం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వ జూని యర్ బాలికల కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపికల్లో వాలీబాల్ అండర్-17లో ఒకరు, ఐదుగురు అండర్-19కు, స్విమ్మింగ్‌లో ఒకరు, కబడీలో ఒకరు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జనార్దనాయుడు తెలిపారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి

విజయనగరం టౌన్, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. గురువారం విజయనగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయం సిబ్బందితో సమీక్షించారు. ఈనెల 14న నిర్వహించనున్న తెప్పోత్సవానికి పెద్ద చెరువు చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు తెలిపారు.

రైతులకు ఎరువులు పంపిణీ

సంతకవిటి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకరాపల్లి, మిర్తివలస రైతు సేవా కేంద్రాల్లో గురువారం యూరియా పంపిణీ చేశారు. రెండు గ్రామాల్లో యూరి యా పంపిణీ సజావుగా జరిగిం దని, యూరియా అందరికీ అందే లా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

రేగిడి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజ లకు డబ్బులు ఆదా అవుతాయని ఖండ్యాం ఆయుర్వేద డిస్పె న్సరీ వైద్యుడు ఎం. సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం ఖండ్యాంలో సుపర్ జీఎస్టీ-సుపర్ సేవింగ్స్‌పై ఆయుర్వేద డిస్పెన్సరీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు.

●వేపాడ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం పీహెచ్‌సీలో బుధవారం జీఎస్టీ సూపర్ ప్రోగ్రాంలో భాగంగా సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ యర్రా రామసత్యవతి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రంలో ఎంపీటీసీ సభ్యురాలు పిల్లా లక్ష్మి పాల్గొన్నారు.

4. 5 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలి

(ఐదో పేజీ తరువాయి)

సరఫరా చేయాలని చెప్పారు. చెక్ పోస్టుల ఏర్పాటు, వర్షాలు పడితే టార్పాలిన్లు సరఫరా చేయడానికి మండల కేంద్రాల్లో సిద్ధం చేయాలని మార్కెటింగ్ ఏడీకి సూచించారు. ధాన్యం సేకరించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయడం, తూకపు యంత్రాలను కేటాయించడం, హమాలీలను గుర్తించడం తదితర కార్యక్రమాలను ఆయా శాఖలు వెంటనే చేయాలన్నారు. అనంతరం జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ గత ఏడాది సేకరణలో తలెత్తిన సమస్యలను వివరించారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డీఎం బొడ్డేపల్లి శాంతి, ఆర్‌డీవోలు కీర్తి, రామ్మోహన్, వ్యవసాయ శాఖ జేడీ భారతి, డీసీవో రమేష్, మార్కెటింగ్ శాఖ ఏడీ కిరణ్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు అభినందనలు


అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మున్సిపాలిటీగా బొబ్బిలి ఇటీవల రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానాన్ని దక్కించుకున్న నేపథ్యంలో గురువారం బొబ్బిలి కోటలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనరు లాలం రామలక్ష్మిలను ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు. 50 వేల నుంచి లక్ష లోపు జనాభా కలిగిన పట్టణాల కేటగిరిలో స్వచ్ఛాంధ్ర అవార్డును రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందడం హర్షనీయమన్నారు. పట్టణంలో ఇంకామెరుగైన సేవలను పౌరులకు అందించి గతంలో మాదిరిగా అనేక జాతీయ, రాష్ట్రీయ అవార్డులను గెలుచుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

నేడు పారిశుధ్య కార్మికులతో సహపంక్తి భోజనం..

బొబ్బిలికి స్వచ్ఛ పట్టణ అవార్డులు ఇతరత్రా అవార్డులు, గుర్తింపు రావడానికి కారకులవుతున్న పారిశుధ్య కార్మికులందరితో కలిసి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సహపంక్తి భోజనం చేయనున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పట్టణానికి పారిశుధ్య సేవలు అందించారని, అప్పట్లో వారందరినీ సముచితంగా సత్కరించుకున్నామన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, అందుకే వారితో విందులో పాల్గొంటామని ఆయన తెలిపారు.

కొండచిలువ హతం



తెర్లాం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): అప్పలంపేటలో కొండచిలువను రైతులు హతం చేశారు. స్థానికుల వివరాలు మేరకు.. గురువారం మధ్యాహ్నం గ్రామం సమీపంలో పొలం చూసేందుకు రైతులు వెళ్తుండగా వారికి కొండచిలువ ఎదురుపడింది. దాంతో అప్రమత్తమైన రైతులు దాన్ని చంపేందుకు యత్నించారు. కొండచిలువ వరి చేనులోకి వెళ్లింది. దాంతో రైతులు గునపాముతో కొట్టి చంపేశారు. కొండచిలువ సుమారు 15 అడుగుల పొడవు ఉంది.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

బాడంగి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం పంటకోత ప్రయోగాలపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ డివిజనల్ ఏడీ మధుసూదన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల స్టాటిస్టికల్ అధికారిణి రజనీ పంటకోత ప్రయోగాల విధివిధానాలను తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి శ్రీమంతు, 14 రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బాడంగిలో గ్రామసభ

బాడంగి, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): బాడంగిలో గురువారం సర్పంచ్ కె.రమేశ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఉపాధి పనుల గుర్తింపునకు నిర్వహించిన సభలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మాట్లాడారు. హార్టికల్చర్, ఫాంపాండ్స్, కంపోస్టు పిట్స్, బౌండరీ ట్రెంచెస్, వ్యక్తిగత పనులకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఉపాధి పనులను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అలాగే వేతనదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. గ్రామ సభలో ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బోధనేతర పనులను బహిష్కరిస్తాం


ఎంఈవోకు నోటీస్ అందజేస్తున్న నాయకులు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనులను శుక్రవారం నుంచి బహిష్కరిస్తామని ఫ్యాప్టో నాయకులు స్పష్టం చేశారు. గురువారం స్థానిక మండల విద్యాశాఖాధికారి సిహెచ్.రమేష్‌కుమార్‌కు నోటీసును అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కె.జోగారావు, ఎస్.వెంకటనాయుడు, సిహెచ్.రామారావు, పీటీఎస్ మహేష్, టిభానుప్రకాశ్, వి.గోపాలకృష్ణమూర్తి తదితురులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరులను సమకూర్చుకోండి

రేగిడి,అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు ప్రజల భాగస్వామ్యంతో ఆర్థికవనరుల సమకూర్చుకోవాలని ఎంపీడీవో శ్యామలాకుమారి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల రెవెన్యూ పెంపుపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్లగా శ్యామ్, హేమసుందర్, గోపాల్‌నాయుడు వ్యవహరించారు.

● నెల్లిమర్ల: సొంత ఆదాయ వనరులు సమృద్ధిగా పెంచు కోవడం ద్వారా పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించవచ్చునని ఎంపీడీవో రామకృష్ణరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకుశిక్షణ నిర్వహించారు.

●రాజాం: పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు పెంపుపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు రాజాం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీవో వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.